క్లుప్తంగా

భూతవాహనంపై నీలకంఠుడు



పురవీధుల్లో విహరిస్తున్న అగస్తీశ్వరస్వామి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం ఈశ్వరగుడివీధిలోని శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయంలో శనివారం పంగుణి బ్రహ్మోత్సవాలు భక్తిప్రపత్తులతో జరిపించారు. మూలస్థానంలోని స్వామివారికి అభిషేక పూజలతో హారతులు పట్టారు. భక్తులకు దర్శన ప్రాప్తి కల్పించారు. ఉదయం భూతవాహనంపై అంగరంగ వైభవంగా ఊరేగించారు. రాత్రి శేషవాహనంపై ఊరేగిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామికి కర్పూర హారతులు పట్టి తరించారు.

వరదరాజుల స్వామికి వెండి పళ్లెం



వెండి పళ్లెం అందజేస్తున్న దాత కుటుంబసభ్యులు

యాదమరి: మండల కేంద్రంలో కొలువైన వరదరాజుల స్వామి ఆలయానికి ఎన్ఆర్ఐ ఎ.హరిబాబు వెండి పళ్లెం బహూకరించాడు. మండలంలోని సీఆర్ కండ్రిగకు చెందిన హరిబాబు తన తల్లి జ్ఞాపకార్థంగా శనివారం రూ.75 వేలు విలువ చేసే వెండి పళ్లెంను ఆలయ కమిటీ సభ్యులు మండలి దేవారాజులుకు అందించారు. అనంతరం మండలంలోని కొందరు పేదవారికి దుస్తులు, నిత్యావసర వస్తువులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఆలయ ప్రధానార్చకులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): హెల్మెట్ లేకుండా రోడెక్కద్దని ఎస్ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. చిత్తూరు మండలం శెట్టిగేతంగాల్ వద్ద శనివారం వాహనచోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో హెల్మెట్ ధారణ అలవాటుగా చేసుకోవాలని సూచించారు. మద్యం మత్తులో రోడ్డు భద్రత సూచనలు మరిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీరాముడు

కార్వేటినగరం : శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలోని సీతా,రామ,లక్ష్మణులు కల్పవృక్ష వాహనంపై పుర వీధుల్లో ఊరేగారు. స్వామిని ఆభరణాలతో అలంకరించి రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు కల్యాణోత్సవం

శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి సీతారాముల వారికి కల్యాణోత్సవం నిర్వహించ నున్నట్లు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు.





పాలు పితుకుతున్న రైతు, పాలు సేకరిస్తున్న సిబ్బంది



ఎండకు తట్టుకోలేక నీటి కోసం వచ్చిన పశువులు

పాల దిగుబడికి వడదెబ్బ

- పాడి పశువులకు వడదెబ్బ
- పశుపోషకులు అవగాహన కలిగి ఉండాలి
- వడదెబ్బకు గురైతే చూడి కట్టే అవకాశం లేనట్లే
- ప్రాణాలు కోల్పోయే ప్రమాదం, పాల ఉత్పత్తిపై ప్రభావం
- వేసవిలో కొద్ది పాటి జాగ్రత్తలతో సంరక్షణ

ఐరాల/గుడిపాల: వేసవిలో పాడి రైతులు పశుపోషణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశు సంవర్ధక శాఖ వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. పాడి ఆవు వడదెబ్బ బారిన పడితే పాల ఉత్పత్తి తగ్గడమే కాకుండా, ఎదకు వచ్చే పరిస్థితులు తగ్గిపోతాయి. చూలు నిలిచే అవకాశం ఉండదని మండల పశుసంవర్ధక శాఖ ఏడీ పద్మావతి, గుడిపాల పశు వైద్యాధికారి సాయిసుధ సూచిస్తున్నారు. వేసవిలో పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకే వ్యాధులను వారు వివరించారు. ఆవులు, గేదెలపై సరైన శ్రద్ధ తీసుకోకుంటే వడదెబ్బకు గురై, ఒక్కొక్కసారి పశువు చనిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. పశువైద్య శాలకు వస్తున్న పాడి రైతులకు ఈ మేరకు అవగాహన కల్పిస్తున్నారు.

వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలు

- పశువులు తాగే నీరు స్వచ్ఛగా, పరిశుభ్రంగా ఉండాలి.
- వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి, నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారుతాయి.
- పశువులు ఈ కలుషితమైన నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలోకి చేరి పారుదు వ్యాధి బారిన పడుతాయి.
- రోజులో కనీసం నాలుగు సార్లు నీటిని అందించడం అవసరం.
- ఆరుబయట తొట్టెలో పగలు నిల్వ ఉన్న నీరు వెచ్చగా మారతాయి.
- నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే పశువులకు తాగించాలి.
- ఆవులతో పోలిస్తే గేదెలు ఎక్కువగా నీటిని తాగుతాయి.
- ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయసు ఆధారంగా రోజుకు సుమారు 35 లీటర్ల నీరు అవసరమవుతాయి.
- పాలిచ్చే పశువులు అదనంగా ప్రతి లీటరు పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి.

నల్లజాతి పశువులకు ఎక్కువ ప్రమాదం

ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసరణ సరిగా లేని ప్రాంతాల్లో, ఎక్కువ సంఖ్యలో కిక్కిరిసిపోయినప్పుడు, నీటి సౌకర్యం అందుబాటులో లేనప్పుడు పశువులు అధిక శ్రమకు గురై వేడిగాలుల తాకిడికి లోనైనప్పుడు వడదెబ్బకు గురవుతాయి. సాధారణంగా ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో ఒకేసారి వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. తెల్లజాతి పశువుల కంటే నల్లజాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు లోనవుతాయి.



వడదెబ్బ నివారణ చర్యలు

- పశువుల పాక చుట్టూ పాత గోనె సంచులు, చీరలు కట్టి వాటిని అప్పుడప్పుడు చల్లని నీటితో తడుపుతూ ఉండాలి.
- పశువుల పాక పాత రేకులతో వేసినట్లయితే పైకప్పును కొబ్బరి, తాటి ఆకు, వరి గడ్డితో కప్పాలి.
- మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేట్లు చూడాలి.
- పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే అంటే చల్లని వాతావరణంలోనే మేతకు వదలాలి.
- పశువులకు వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి.
- సంకరజాతి ఆవులకు, గేదెలకు పాకలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి.
- చెరువులు, కుంటలు ఉన్నట్లయితే పశువులను వాటిలో కాసేపు ఈదనివ్వాలి.

వడదెబ్బ లక్షణాలు

- పశువులో శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 106 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువులు నడిచేటప్పుడు తూలుతాయి.

శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది.

- పశువు చాలా నీరసంగా కనబడుతుంది.
- నోటివెంట చొంగ కారుతుంది
- ఒక్కొక్కసారి కింద పడి విలవిల్లాడి స్పృహకోల్పోతాయి.
- ఆ సమయంలో పశువు నీటి కోసం అల్లాడుతుంది.
- చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది.
- పాల ఉత్పత్తి కోల్పోతుంది.
- చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి.

పశువులో పునరుత్పత్తి ప్రక్రియ కుంటుపడుతుంది.

వడదెబ్బ నివారణకు చికిత్స

వడదెబ్బ తగిలిన పశువును రైతులు గుర్తించిన వెంటనే చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. ఐస్ పలుచటి వస్త్రంలో చుట్టి పశువు నుదిటిపై మెల్లగా రుద్దాలి. కొద్దిగా ఊరట కలిగిన తరువాత దగ్గరలోని పశు వైద్యుడిని సంప్రదించి, వైద్యుడు సూచనల మేరకు సెలైన్ పెట్టాలి.

భూమి కబ్జా చేశారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తమ పూర్వీకులకు చెందిన భూములకు అక్రమంగా 1బి, పట్టాదారు పాస్ పుస్తకాలు సృష్టించి కబ్జా చేశారని పలమనేరు మండలానికి చెందిన హైదర్ వలీ బాషా ఆరోపించారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. పలమనేరు రెవెన్యూ గ్రామంలో ఆరు ఎకరాల భూమి తమ తాత పేరు నుంచి తండ్రి పేరిట రిజిస్ట్రేషన్ అయిన పత్రం ఉందన్నారు. ఈ భూమిలో తాను 2018 వరకు సాగు పనులు చేసుకుంటున్నానని తెలిపారు. అయితే పలమనేరుకు చెందిన కొందరు తప్పుడు వన్‌బీ, పట్టాదారు పాస్ పుస్తకాలు సృష్టించి లేఔట్ వేశారని ఆరోపించారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి



చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

తవణంపల్లె: మండలంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌జీబీ రీజనల్ మేనజర్ విష్ణుచరణ్ తెలిపారు. అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు ద్వారా ఈచనేరికి చెందిన కుమారి ప్రమాద బీమా పథకం కింద రూ.177 ప్రీమియం చెల్లించింది. గత సంవత్సరం జూన్‌లో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. మృతురాలు కుమారి కుమార్తె కె.లక్ష్మీ నామినీగా ఉంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం మండలంలోని అరగొండ గ్రామీణ బ్యాంకులో రీజనల్ మేనేజర్ విష్ణుచరణ్, మేనేజర్ నవీన్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో యూనివర్సల్ సొంపు ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ.5 లక్షల చెక్కును నామినీ కె.లక్ష్మీకి అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

వీణ విజయరామరాజు సేవలు అమూల్యం



నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: ఎస్టీయూ సంఘం ఉద్యమ నాయకుడు వీణ విజయరామరాజు సేవలు అమూల్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో ఆదివారం వీణ విజయరామరాజు 25వ వర్ధంతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత విలువలు అభ్యుదయ భావాలతో ఎన్నో ఉద్యమాల్లో వీణ విజయరామరాజు పాల్గొన్నారని చెప్పారు. ఎన్నో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. స్వాతంత్ర్యం రాక ముందు స్థాపించిన ఎస్టీయూ సంఘం టీచర్లకు అండగా ఉంటోందన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్, నాయకులు పురుషోత్తం, దేవరాజురెడ్డి, బిక్కా మురళి, ఢిల్లీ ప్రకాష్, చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ జయంతి



నివాళులర్పిస్తున్న గల్లా అరుణకుమారి

తవణంపల్లె: మండలంలోని దిగువమాఘం రాజన్న పార్కులో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఆధ్వర్యంలో మాజీ ఎంపీ రాజగోపాల్ నాయుడు 105వ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజన్నపార్కులోని రాజగోపాల్‌నాయుడు కాంస్య విగ్రహానికి మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజ బ్యాటరీస్ అధినేత గల్లా రామచంద్రనాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న గజమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపి, నాయకులు వెంకటేశ్వరచౌదరి, సురేష్, మహేష్ పాల్గొన్నారు.

రామాలయంలో నేడు ప్రత్యేక పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరి గ్రామంలో ఆదివారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకోదండరామస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలతోపాటు ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి గ్రామోత్సవాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. రాత్రి ఆలయం ఆవరణలో హరికథ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దైవ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారామస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పాలేరులో సీతారాముల కల్యాణోత్సవం

మండలంలోని పాలేరు శ్రీకోదండరామ భజన మందిరంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు హరికథా కాలక్షేపం చేపట్టనట్లు వివరించారు. 15వ తేదీ రాత్రి స్వామి రథోత్సవం ఉంటుందన్నారు. మండలంలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

నేడు ఆలయాల్లో శ్రీరామనవమి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని పలు ఆలయాలు శ్రీరామనవమికి ముస్తాబయ్యాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు పూజలు నిర్వహించనున్నారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపించనున్నారు. ఇందులో భాగంగా వేదికలు శోభయమానంగా ముస్తాబయ్యాయి. రాములుగుడివీధిలోని శ్రీకోదండరామ స్వామి ఆలయంలో నవమి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఉదయం హంస, రాత్రి సూర్య ప్రభ వాహనాల్లో ఊరేగించనున్నారు. పొన్నియమ్మ గుడివీధిలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో గరుడసేవను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సుధాకర్ గురుక్కల్ తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు పలుపూజలు, సేవలు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. టాప్‌లైన్, మిట్టూరు, గిరింపేటలోని రామ మందిరాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాములు కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు.

నేటి విద్యార్థులే రేపటి పౌరులు





వార్షికోత్సవంలో భరత నాట్యం చేస్తున్న విద్యార్థులు, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

తవణంపల్లె: నేటి విద్యార్థులే రేపటి పౌరులుగా ఎదగాలని కాణిపాకం ఎస్ఐ ధరణీధర్ ఆకాంక్షించారు. మండలంలోని శ్రీవినాయక విద్యామందిర్ పాఠశాల కరస్పాండెంట్ గణపతినాయుడు, ఎండీ భాస్కర్‌చౌదరి ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ ధరణీదర మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులకు నిర్వహించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు, నాటికలు, నాట్యం ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎస్ఐ ధరణీధర

రామాలయంలో బ్రహ్మోత్సవం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో శనివారం వార్షిక బ్రహ్మోత్సవం అత్యంత వైభవం ప్రారంభమైంది. ఉదయం ధ్వజారోహణ పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. సప్త ఉత్సవాన్ని వేదమంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. రాత్రి సింహ వాహనంపై స్వామి వారు విహరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.





ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం, అలంకరణలతో కోదండరాముడు

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

చిత్తూరు కలెక్టరేట్: సమాజంలో వివక్షపై బాబు జగ్జీవన్ రామ్ తిరుగుబాటు చేశారని జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ అన్నారు. జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డా.బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ న్యాయ పోరాట యోధుడని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు రెడ్డి బాషా, సిబ్బంది చిట్టిబాబు పాల్గొన్నారు.

చిత్తూరు కార్పొరేషన్: మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా పలువురు నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్థానిక గంగినేని చెరువు వద్ద గల ఆయన విగ్రహానికి సీపీఐ నాయకులు పుష్పాంజలి ఘటించారు. నాయకులు నాగరాజన్, దాసరి చంద్ర మాట్లాడుతూ ఆయన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేశారన్నారు. కేంద్రం కార్మిక, వ్యవసాయ, రక్షణ, రైల్వే, విమానయాన శాఖ మంత్రులుగా బాబు జగ్జీవన్ రామ్ ప్రాతినిధ్యం వహించారని చెప్పారు. కార్యక్రమంలో మణి, ఆర్ముగంరెడ్డి, విజయకుమార్, విజయగౌరీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆయన చేసిన ఘనతను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, షణ్ముగం, గోకుల్ యాదవ్, రామభద్ర తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఏపీసీ వెంకటరమణ



చిత్తూరు: బీజేపీ నాయకులు

మేయర్ నివాళి

చిత్తూరు అర్బన్: మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చిత్తూరు మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్‌తో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, అధికారులు గోపాలకృష్ణవర్మ, ఉమామహేశ్వర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా జయంతి వేడుకలు

యాదమరి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీఓ వేణు తమ సిబ్బందితో కలిసి జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. ఆర్ఐ ప్రసాద్, ఈఓపీఆర్డీ సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

తవణంపల్లె: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుధాకర్, ఆర్ఐ జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో, ఎన్‌హెచ్ఆర్‌సీ ఆధ్వర్యంలో బాబూ జగజ్జీవన్‌రాం జయంతి వేడుకలను రాయలసీమ డివిజనల్ వైస్ ప్రెసిడెంట్ దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్‌హెచ్ఆర్‌సీ నాయకులు గజేంద్ర, విజయ్, చిట్టిబాబు, నరేష్‌బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు జయచంద్ర పాల్గొన్నారు.











యాదమరి: నివాళులర్పిస్తున్న అధికారులు, పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న సిబ్బంది, చిత్తూరు: నివాళులర్పిస్తున్న మేయర్, కమిషనర్, సీపీఐ నాయకులు, తవణంపల్లెలో నివాళులర్పిస్తున్న ఎన్‌హెచ్ఆర్‌సీ నాయకులు

మరుభూమి కష్టాలు



పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ చెరుముందర కండ్రిగ గ్రామానికి శ్మశాన వాటిక లేదు. ప్రస్తుతం గ్రామాల్లో మృతి చెందిన వారిని చెరువు కాలువ పక్కన పూడ్చి పెడుతున్నారు. కాలువలో నీరు ఎక్కువైపోతే పూడ్చిన శవాలు నీటిలో కొట్టుకుని చెరువులోకి పోతున్నాయి. అధికారులు స్పందించి చెరుముందర కండ్రిగ గ్రామానికి శ్మశాన వాటిక ఏర్పాటు చేసి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.